# కౌతుక గాథలు

ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

## ఆవకాయ మహోత్సవం

తలిసెట్టి రామారావుగారు మొట్టమొదట తెలుగు దేశానికి ఘనమైన వ్యంగ్య చిత్రాలు చవిచూపిన ఘనుడు.

ఆయన వ్యంగ్య చిత్రం ఒకటి ఈ రోజుల్లో - అంటే మే. జూన్ నెలల్లో తప్పకుండా జ్ఞాపకం వస్తుంది. దాని పేరు "ఆంధ్రుల ఆవకాయోత్సవం!"

ఒక రెండెడబండిమీద పెద్ద పనస కాయంత మామిడికాయ నాలుగుపేటలుగా చీల్చి దానినిండా ఎర్రని ఆవకాయకారం కట్టుదిట్టంగా కూరితే—అదివికసిత సహస్ర కమలంలా నాలుగు చెక్కలూ నాలుగు మూలలకూ సమంగా విడి కన్నులపండువు చేయగా వూరేగింపు బయలుదేరుతుంది. బండిచుట్టూ ఆవకాయంటే ప్రాణం పెట్టే పక్తు ఆంధ్ర జనం. ధోవతులు. లాల్చీలు. పాంట్లు.షర్టులు. పిలకలు. క్రాపులు అనే భేదం లేకుండా కలిసికట్టుగా ఆనంద తన్మయంగా పురుషులు నడుస్తూ వుంటే- స్త్రీలు అలంకృత సర్వాభరణలై గ్రామదేవత పండుగులో ఘటాల్లా చక్కని ఊరగాయ ఘటాలు తలపై పెట్టుకుని ఒయ్యారంగా నడుస్తూ ఉండగా ముందు సన్నాయిమేళం. చూడ ముచ్చటగా ఉంది.

నిజమైన ఆవకాయ సౌభాగ్యం— గోదావరి జిల్లాలో అందులోనూ— కోన సీమలో చూడాలి.

అందరికీ చిన్నా పెద్దా మామిడితోట లుంటాయి. ప్రతి తోటలోను ఆవకాయ చెట్టని ఒకటి విధిగా ఉంటుంది. వంశ పారంపర్యంగా తాత ఆయన తాత యెంచి దాని యోగ్యత నిర్ణయించి చప్పరించి మరీ వేసిన చెట్టది!

ఆవకాయ చెట్టు అహంకారం ఎలాంటి దంటే ప్రతి పొరుగు చెట్టూ రెండో పక్షమే.

15 రోజులు ప్రతిపెరడూ ఒక ఆవకారం కార్ఖానా. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకూ రోకటి దెబ్బలతో ఆకాశం శబ్దగుణకం అయిపోతుంది.

వాతావరణం అంతా ఖారం!

ఇంటినిండా తుమ్ములు!

హైస్కూల్లో ఉద్యోగం చేసే రోజుల్లో ఒక హెడ్ మాష్టరుగారుండేవారు. స్కూల్లో ఉన్నంత సేపూ పగడైన తలపాగా, నిండు బొత్తాల ఆల్పాగా కోటూ, దానిపై రెండు వైపులకూ జారిచ్చిన జరీ ఖండువా, స్కూలు రౌండ్సుకు వెళ్ళే ధీరోదాత్తగమనం. చూస్తే దగ్గరకు వెళ్ళడానికే భయంగా వుండేది.

అట్టి విద్యాధికారి ఆవకాయ రోజుల్లో పరమ శ్రోత్రియంగా మారి తెల్లవారు జామున నాలుగు గంటలకు లేచి పైన ఒక తువాలు. కింద ఒక పెద్ద అంగోస్త్రం ధరించి ఇంటికివచ్చి 'శాస్త్రిగారూ. పదండి' అంటే - ఎక్కడికి? అని అడగకూడదు. ఎక్కడికో విశదమే. మైలుదూరంలో కాలవవతల ఒకచెట్టు ఆవకాయకు ప్రశస్త మని ఎవరో చెప్పారు. అడ్డమైన చెట్టూ ఆవకాయకు పనికిరాదని శాస్త్రం.

చెట్టు బాగా ముదరది. శాఖోపశాఖలుగా విస్తరించి ఆముక్తమాల్యదలో వట వృక్షంలా వుంది. భేష్ అనుకున్నారు మా మేషరుగారు. చెట్టు కాపలా మనిషిని లేవ గొట్టారు. వంద ఇంతకని తెగ్గొట్టారు. ఒక్క రూపాయి పెచ్చు తగిలించేటప్పటికి అతడు చెంగున చెట్టుమీదున్నాడు. 15 ఏళ్ళ కొడుకు గట్టి చిక్కం కట్టిన వెదురుగడ తండ్రికి అందించాడు.

కాయలు కోసి చిక్కంలో వెయ్యాలి. వేసినవి ఒక్కటీ కింద పడకుండా అందుకోవాలి. అందుకున్నవాటిని చంటిపిల్లల్లా బుజ్జగించి బుట్టలో వెయ్యాలి. నేలమీద కాయ పడిందా దాని పని గోవిందా! దూరంగా పెట్టెయ్యాలి.

మేష్టరుగారు మొదటి చిక్కంలోనుంచి ఒక కాయ తీసి "ఆహ! ఏమి జాతండి! ఇలా ఉండాలి. ఆవకాయ అంటే- చర్మం తెల్లగా ఉండాలి. ముచిక దగ్గర రవంత పరువు కనపడాలి. పీచుకు పీచూ. పులుపుకు పులుపూ. మొలిచి నట్టుండాలి. ఈ కాయ చూడండి." అని కత్తితో ఒక బద్ద చీల్చి నా చేతిలో పెట్టారు. ముక్క నోట్లో వేసుకుంటే నసాళం అంటింది. పులుపు. నేను పులుపు తినలేను. బంగినపల్లి ఆవకాయ తినే రకం. నా ముఖంలో మెప్పు కనబడకపోతే రెండు యింక్రిమెంట్లు పోతా యన్నంత భయం. కనుబొమ్మ లెగరేసి కళ్ళు పెద్దవి చేసి సాధ్యమైనంత మెప్పు నటించాను. ఇంకో ముక్క నోట్లో వేసుకున్న మేష్టారు అర్ధ నిమీలిత నేత్రులై నా మెప్పు స్వీకరించ లేదు. ఎడ్యుకేషన్ స్టాండర్డ్సు పడిపోతూ న్నట్టే ఆవకాయస్థాయి పడిపోతూన్నందుకు చాలా విచారించారు లోలోపల. స్కూలు టైం జ్ఞాపకంచేసి మేష్టార్ని ఆవకాయ తన్మయత్వంలోంచి విడదీసి గృహోన్ముఖులను చేశాను.

ఒకసారి కొత్తావకాయ రోజుల్లో పని మీద రాజమండ్రి వెళ్ళి సుబ్రహ్మణ్య శాస్త్రిగారింట్లో మకాం చేశాను. రాత్రి శాస్త్రిగారితో పరమాప్యాయంగా భోజనం— పిన్నిగారు వారం రోజులకిందట వేసిబాగా ఊరిన ఆవకాయ, తదితర జాతి ఉపజాతులు పేరుపేరువరసనా వడ్డించి రుచి చూడమన్నారు. అక్కడ ఆడవారికి ఎవరెన్నిరకాలు ఎక్కువ పెడితే అంత ఘనత! అవి ఆప్తులు తిని మెచ్చుకుంటే కృతార్థత!

కొత్తావకాయ సిందూర తిలకంలా శివుడి మూడో కన్నులా జాజ్వల్యమానంగా వుంది. దానితో ఒక పెద్ద వాయి కానిచ్చి తక్కిన 'వివిధ భారతి' తగు మాత్రంగా సంభావించి భోజనం ముగించాను.

భోజనానంతరం శాస్త్రిగారూ, నేనూ సాహిత్యం. కథలూ కబుర్లలో పడ్డాం. పది గంటలయింది. కన్ను పొడుచుకున్నా నిద్రరావడంలేదు. కళ్ళు మండుతున్నాయి. శాస్త్రిగారు కనిపెట్టారు. "ఆవకాయ వేడి. నిద్ర పట్టదు వుండండి." అని ద్రాక్షారిష్టం సీసా తీసి రెండు చెంచాలు నీళ్ళలో కలిపి "పుచ్చుకోండి" అన్నారు.

చిరుఘాటుగా తియ్యగా గొంతు దిగింది.

ఆవకాయ జోరు తగ్గి నిద్ర పట్టేసింది.